చంద్రబాబు, పవన్‌లకు ప్రజలే బుద్ధి చెబుతారు

- వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆళ్ల నాని ధ్వజం
- ఏలూరులో మూడో రోజు గృహసారథుల ఆత్మీయ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని



సమావేశానికి హాజరైన వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు

ఏలూరు టౌన్: రాష్ట్రంలో పేదల సంక్షేమమే ధ్యేయంగా ఆర్థిక ఇబ్బందులున్నా ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలతో విశేష కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దుష్ప్రచారం చేస్తూ మరోసారి మోసం చేయాలని కుటిల రాజకీయాలు చేస్తున్న చంద్రబాబు, లోకేష్‌లకు ప్రజలే బుద్ధి చెబుతారని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఏలూరు శనివారపుపేట సారథి కల్యాణ మండపంలో మూడో రోజు జోన్-3 సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథుల ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. గృహసారథులకు విధి విధానాలపై తొలుత అవగాహన కల్పించారు. పార్టీ నగర అధ్యక్షులు బొద్దాని శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆళ్ల నాని మాట్లాడుతూ చిత్తశుద్ధిలేని చంద్రబాబు తీరు వల్లే పోలవరానికి నేడు ఈ దుస్థితి వచ్చిందన్నారు. కేంద్రం నుంచి వేల కోట్లు ఎలా వస్తాయా.. ఎలా దోచుకుతిందామా అనే ఆలోచనే తప్ప ప్రజలకు మంచి చేయాలనే ఉద్దేశం బాబుకు లేదని విమర్శించారు. పోలవరానికి దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేసి 60 శాతానికి పైగా పనులు పూర్తి చేశారని, దురదృష్టవశాత్తు ఆయన ప్రజలకు దూరం అయ్యారన్నారు. అనంతరం చంద్రబాబు పోలవరంపై ఒక్క ఇటుకైనా పేర్చారా అని ప్రశ్నించారు. చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే టీడీపీ హయాంలో ఐదేళ్లలో ప్రాజెక్టు పూర్తి అయ్యేదన్నారు. ప్రజలంతా చంద్రబాబుకు పట్టం కడితే ఇచ్చిన హామీల్లో చంద్రబాబు ఒక్కటీ పూర్తి చేయాలేదని విమర్శించారు. సీఎం వైఎస్ జగన్‌పై బురద చల్లడానికే లోకేష్ పాదయాత్ర చేస్తున్నారని మండిపడ్డారు. పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్లు లోకేష్ పాదయాత్ర చేయటం హాస్యాస్పదంగా ఉందన్నారు. వందమంది కూడా లేని పాదయాత్రకు పోలీస్ రక్షణ దేనికి అంటూ ప్రజలే లోకేష్‌ను నిలదీస్తున్నారన్నారు. ఒకవైపు చంద్రబాబు, మరోవైపు లోకేష్, పవన్‌కల్యాణ్, ఇతర చెంచాగిరి చేసే వారందరూ కలిసి మూకుమ్మడిగా దాడి చేస్తున్నా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలబడి ప్రజారంజక పరిపాలన చేస్తున్నారన్నారు. కోట్లాదిమంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు వెన్నంటి సీఎం వైఎస్ జగన్ ఉంటూ ధైర్యం ఇస్తున్నారన్నారు. తమ నమ్మకం మీరే జగనన్నా అంటూ అండగా నిలబడడంతో వెనుకంజ వేయకుండా ప్రతి హామీని అమలు చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముందుకు వెళుతున్నారన్నారు. ప్రజల ఆశీస్సులతో రాబోయే 25 ఏళ్లు ముఖ్యమంత్రిగా పాలన చేస్తారన్నారు. ఈ నెల 11వ తేదీన రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి గృహ సారథులుగా కార్యక్రమాన్ని ప్రారంభించనున్నామని ఎమ్మెల్యే నాని చెప్పారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి, ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్‌పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరి, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పేదల సంక్షేమంతో చెలగాటమాడే చంద్రబాబుతో సహా ప్రతిపక్షాలకు సరైన బుద్ధి చెప్పాలని తెలిపారు. డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ కంచన రామకృష్ణ, పార్టీ సీనియర్ నాయకులు మధ్యాహ్నపు బలరాం, కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, మున్నుల జాన్‌గురునాథ్, మహిళా నాయకులు నున్న స్వాతిశ్రీదేవి, జోన్-1 కన్వీనర్ యర్రంశెట్టి సుమన్, జోన్-2 కన్వీనర్ బందారు కిరణ్, జోన్-3 కన్వీనర్ తుమరాడ స్రవంతి, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హెచ్‌ఎంకు సన్మానం



రజనికుమారిని సన్మానించిన దృశ్యం

ఏలూరు రూరల్: గుడివాకలంక జెడ్పీ హైస్కూల్ ఇంగ్లిష్ టీచర్‌గా పి.రజనీకుమారి నియమితులయ్యారు. వెంకటాపురం మస్తాన్‌మన్యం కాలనీ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న ఆమె పదోన్నతిపై గుడివాకలంకకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు రజనికుమారి దంపతులకు దుశ్శాలువా కప్పి సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి ఆమె చేసిన కృషిని కొనియాడారు. ఎల్.కనకదుర్గ, ఎం.విజయపద్మలత, పలువురు విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వికలాంగులందరికీ పింఛన్లు ఇవ్వాలి

ఏలూరు (టూటౌన్): వికలాంగులందరికీ పింఛన్లు ఇవ్వాలని వికలాంగుల సంక్షేమ సంఘం (విసాస్) రాష్ట్ర అధ్యక్షులు అల్లాడి నటరాజు ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఒకే రేషన్ కార్డులో వికలాంగులు ఉన్న కుటుంబంలో పింఛన్‌కు అర్హత ఉన్న అందరికీ లబ్ధి అందించాలన్నారు. పెళ్లితో సంబంధం లేకుండా ఒకే కుటుంబంలో ఎంతమంది వికలాంగులు ఉన్నా అందరికీ పింఛన్ ఇవ్వాలని, సర్వేల పేరుతో వికలాంగుల పింఛన్‌లను తొలగించడం తగదన్నారు. ఇటీవల తొలగించిన వికలాంగుల పింఛన్‌లను తిరిగి పునరుద్ధరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పింఛను పొందుతున్న వికలాంగుని కుటుంబంలో వివిధ రకాల పింఛన్లకు అర్హులుంటే వారికి కూడా ఆయా పింఛన్లు అందించాలని కోరారు.

నేడు అంగన్‌వాడీల ధర్నా

ఏలూరు (టూటౌన్): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షురాలు కె.విజయలక్ష్మి, అధ్యక్షురాలు హసీనా బేగం, కార్యదర్శి పి.భారతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని, 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న టీఏ బిల్లులను చెల్లించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు ఇవ్వాలని, సగం జీతం పెన్షన్‌గా అందించాలని, మినీ వర్కర్లను వర్కర్లుగా గుర్తించి కనీస వేతనం ఇవ్వాలని, ప్రమోషన్లు కల్పించాలనే 14 డిమాండ్ల పరిష్కారం కోసం ఈ ధర్నా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో తైపూసం మహోత్సవం



శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకుంటున్న జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ దంపతులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక పోస్టల్ కాలనీలోని శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో మాఘ పుష్యమి నక్షత్ర పర్వదినం సందర్భంగా ఆదివారం తైపూసం మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తమిళనాడు సంప్రదాయం తరహాలో ఉదయం స్వామి వారికి గోక్షీరంతో 108 కలశాలతో అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహించారు. అంతకు ముందు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచన, సుబ్రహ్మణ్యేశ్వర హోమం వైభవంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ వే. ప్రసన్న వెంకటేష్, మానస దంపతులు పాల్గొన్నారు. వారికి ఆలయ అర్చక స్వాములు తీర్థ ప్రసాదాలు అందించి వేద ఆశీర్వచనం పలికారు. అనంతరం దేవదాయ, ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ మేడిపల్లి విజయరాజు, ఉప స్థపతి ఎం. నాగేశ్వరరావు, స్థానిక కార్పొరేటర్ గూడూరి ఆదిలక్ష్మి, ప్రసాద్ దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమాలను ఈఓ కలగర శ్రీనివాస్ పర్యవేక్షించారు.

శ్రీరామకోటి మహోత్సవాలు ప్రారంభం



ఉత్సవమూర్తులను ప్రాంగణం వద్దకు తీసుకువస్తున్న శ్రీరామకోటి విశ్వశాంతి సమాజం ప్రతినిధులు



విశేష అలంకరణలో శ్రీ సీతారాములు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలో శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం ఆధ్వర్యంలో 91వ శ్రీరామకోటి మహోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం వివిధ ధ్వజాల ఆరోహణలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి విశ్వశాంతి సమాజం సభ్యులు మౌనధ్యానం, భక్తిగీతాలపానలు, హరేరామ సంకీర్తనలు చేశారు. అనంతరం విఘ్నేశ్వర పూజతో ఉత్సవాలను ప్రారంభించి కలశ స్థాపన, అఖండ దీపారాధన, స్వామి వారికి సహస్రనామ పూజలు, నిత్యహోమం చేసి స్వామివారి నిత్య కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం వీరా ప్రసాద్ శిష్య బృందం నిర్వహించిన సంగీత కచేరి వీనులవిందు చేసింది. అనంతరం మద్దూరి సత్యనారాయణ ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. రాత్రి 7 గంటలకు నగరానికి చెందిన నృత్యాంజలి కళానికేతన్ ఆధ్వర్యంలో నాట్యాచార్య గండికోట రాజేష్ శిష్యబృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు ఆకట్టుకున్నాయి. తొలుత అర్చక స్వాములు దివాకరుని వెంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీవిశ్వేశ్వరశర్మ విశేష పూజలు నిర్వహించగా శ్రీరామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించాలి



టికు బ్యాంక్ మహాజన సభలో ప్రసంగిస్తున్న బ్యాంక్ చైర్మన్ అంబికా ప్రసాద్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ది ఏలూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ (టికు బ్యాంక్)లో రుణాలు తీసుకున్న ఖాతాదారులు సక్రమంగా ప్రతి నెలా వాయిదా చెల్లించాలని ఆ బ్యాంక్ చైర్మన్ అంబికా ప్రసాద్ కోరారు. ఆదివారం స్థానిక శ్రీగాంధీ ఆంధ్ర జాతీయ మహా విద్యాలయం ప్రాంగణంలో టికు బ్యాంక్ మహాజన సభ నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన అంబికా ప్రసాద్ మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణంగా వాయిదాలు చెల్లించని పక్షంలో వాటిని ఒత్తిడిలో ఉన్న రుణాలుగా భావిస్తారని, ఆయా రుణ ఖాతాల నుంచి రావలసిన అసలు, లేక వడ్డీ 90 రోజులు దాటి వసూలు కాకుండా ఉంటే అలాంటి రుణాన్ని నిరర్థక ఆస్తిగా ప్రకటించాలని రిజర్వ్ బ్యాంక్ ఆదేశించిందని తెలిపారు. తమ బ్యాంక్ వ్యాపారాన్ని రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించడానికి తగిన కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. బ్యాంక్ ఉద్యోగుల సర్వీస్ నిబంధనలను ప్రస్తుత నిబంధనలకు అనుగుణంగా మార్చడానికి మహాజన సభ ఆమోదించింది. అలాగే 2022 మార్చి 1వ తేదీ నుంచి 2023 జనవరి 31వ తేదీ వరకు నూతనంగా చేర్చుకోబడిన సభ్యత్వాల, వాపసు చేసిన వాటాధనాలను సైతం మహాజన సభ ఆమోదించింది. బ్యాంక్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎం.అచ్యుత రావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్‌గా నతానియేలు

దెందులూరు : గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ ఎస్.నత్తానియేలు బాధ్యతలు స్వీకరించారు. కామవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఆయన వ్యాయామ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా బదిలీపై వచ్చారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన మండల కమిటీ నాయకులు

ఏలూరు రూరల్: ఏలూరు మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గ అధ్యక్షులుగా పాటూరి సురేష్‌బాబు ఎన్నికయ్యారని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నంబూరి రాంబాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఏలూరులోని యూనియన్ జిల్లా కార్యాలయంలో జరిగిన ఎన్నిక వివరాలను ఆయన వెల్లడించారు. గౌరవ అధ్యక్షులుగా ఓవీ ధనుంజయరావు, సహాధ్యక్షులుగా కె.శ్రీధర్, జి.మాధవిలత, ప్రధాన కార్యదర్శిగా పంపన శ్రీనివాస్‌కుమార్, కోశాధికారిగా తాడేపల్లి యేషయ్య, కార్యదర్శులు పీవీ జనార్ధనరావు, పీవీ సుబ్బారావు, బి.ప్రభాకర్‌రావు, కేవీఎస్ మణి, పి.సత్యనారాయణ, దుర్గాభవాని ఎన్నికయ్యారని వివరించారు. వీరితో పాటు ఆడిట్ కన్వీనర్‌గా బి.రవిశోభన్‌కుమార్, జిల్లా కార్యదర్శులుగా వి కనకదుర్గ, ఏవీఎస్ రాజు, ఎల్.కనకదుర్గ, ఎస్కే సుభాని బేగం ఎన్నికయ్యారని వెల్లడించారు. ఎన్నికల అధికారిగా నంబూరి రాంబాబు, పరిశీలకుడుగా పీవీ నరసింహరావు పాల్గొన్న ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి ముఖ్య అతిథిగా పాల్గొని ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడాలని నూతన కార్యవర్గానికి సూచించారని వివరించారు.

పందుల కళేబరాలతో తీవ్ర దుర్గంధం

ఏలూరు రూరల్: శనివారపుపేట శ్రీరామ్‌నగర్‌లో పందులు మృతి చెంది దుర్గంధం వెదజల్లుతోంది. స్థానిక 5వ రోడ్డు ఖాళీస్థలంలో కొద్దిరోజులుగా పదుల సంఖ్యలో పందులు మృతి చెందుతున్నాయి. రోజుల తరబడి అక్కడే ఉండడంతో కళేబరాల నుంచి తీవ్ర దుర్గంధం వస్తుండటంతో స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. ముక్కు మూసుకుని రహదారుల్లో సంచరించాల్సి వస్తోందని, ఇళ్లల్లో సైతం ఉండలేకపోతున్నామని వాపోతున్నారు. మరోపక్క కుక్కలు కళేబరాలను కరుచుకుని వీధుల్లో తిరుగుతున్నాయి. నగర కార్పొరేషన్ ప్రజారోగ్య, శానిటేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

యూటీఎఫ్ నిరాహార దీక్ష

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉద్యమాలపై నిర్బంధం ఆపాలని ఎమ్మెల్సీ షేక్ సాబ్జి కోరారు. సీపీఎస్ రద్దు చేయాలనే డిమాండ్‌తో సంకల్పదీక్షకు పిలుపునివ్వగా ప్రభుత్వం దీక్షను భగ్నం చేసి ఉపాధ్యాయులను అరెస్టు చేయడంపై నగరంలో ఆదివారం ఒక రోజు నిరాహారదీక్ష చేశారు. యూటీఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన నిరాహారదీక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సాబ్జీ మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌జీఓ నాయకుడు ఆర్ఎస్ హరనాథ్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.రవికుమార్, ప్రధాన కార్యదర్శి పీవీ నరసింహరావు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	12	చిక్కుడు కాయలు	30
వంకాయలు (కాంతులు)	20	చామదుంపలు	56
వంకాయలు (తెలుపు)	18	ములక్కాడలు	12-15
బెండకాయలు	52	కంద	40
పచ్చిమిర్చి	24	బీట్‌రూట్	34
కాకర కాయలు	30-34	కీరా దోస	44
బీరకాయలు	36	ఫ్రెంచ్‌బీన్స్	46
బీరకాయలు (పందిరి)	48	అల్లం	70
క్యాబేజీ	16	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	32	పాలకూర	08
దొండకాయలు	24	చుక్కకూర	08
బంగాళదుంపలు	20-25	తోటకూర	08
ఉల్లిపాయలు	24	గోంగూర	08
గోరుచిక్కుడు	40	పుదీనా	07
దోసకాయలు	28-40	బఠాణి	--
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	56
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	24-30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	30
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	22
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	22
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	16
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	26
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	14
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	31
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	33
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు - తిరుపతి	16.00	4830	33

కులం పేరుతో దూషించారని కేసు నమోదు

ఏలూరు టౌన్: ఏలూరు మండలం పోణంగి ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తిని కులంపేరుతో దూషించారనే ఫిర్యాదు మేరకు ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు రూరల్ పోణంగి ప్రాంతానికి చెందిన జంగం వెంకటరత్నంను ఈ నెల నాలుగో తేదీన అదే గ్రామానికి చెందిన గంటా రామకృష్ణ, మరో వ్యక్తి కులం పేరుతో దూషించి, దౌర్జన్యం చేయటంతో బాధితుడి ఫిర్యాదు మేరకు రామకృష్ణ తదితరులపై ఆదివారం రాత్రి ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

భీమడోలు : ఆధ్యాత్మిక చింతనతోనే గ్రామాలు ప్రశాంతంగా ఉంటాయని గుండుగొలను ఉపసర్పంచ్, వైఎస్సార్ సీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు ముదుండి సూర్యనారాయణరాజు అన్నారు. గుండుగొలనులోని డొకల వీధి సగర్ల సంఘానికి చెందిన కనకదుర్గాదేవి ఆలయ పునర్నిర్మాణానికి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. పూజారి లంకా శివకుమార్ శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. నవధాన్యాలు వేసి పూజాధి కార్యక్రమాలు చేసారు. ఈ సందర్భంగా ప్రజలంతా దైవ చింతనతో మెలగాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు నల్ల శంకర్, జి.మల్లేశ్వరరావు, నాయకులు నల్ల శ్రీనివాసరావు, సగర్ల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

శివాలయానికి వెండి సమర్పణ

ఉంగుటూరు: నారాయణపురంలోని విఘ్నేశ్వర కాశీ అన్నపూర్ణ దేవాలయంలో వేంచేసి ఉన్న స్వామి వారికి, గణపతి స్వామికి మకరతోరణం కోసం కాకినాడకు చెందిన మామిడి సత్యనారాయణ, రమాదేవి దంపతులు కేజీ వెండిని అందచేశారు. అమెరికాలో ఉంటున్న వారి కుమారుడు సుబ్రహ్మణ్యం, కోడలు గాయత్రి ఈ వెండిని సమకూర్చారు. సత్యనారాయణ దంపతులు ఆలయ ధర్మకర్త బొడ్డేపల్లి అప్పారావు, బొడ్డేపల్లి ప్రసాదుకు ఈ వెండిని అందజేశారు.

బైక్ ర్యాలీగా తరలివెళ్లిన యాదవ యువత



ద్వారకాతిరుమలకు బైక్ ర్యాలీగా తరలివెళుతున్న యువకులు

ఏలూరు (టూటౌన్): ద్వారకాతిరుమలలో ఆదివారం నిర్వహించిన యాదవ యువ సమ్మేళనం కార్యక్రమానికి యాదవ యువకులు మోటారు బైక్ ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. ఏలూరు జిల్లా యాదవ యువ సమితి అధ్యక్షుడు కాట్రు బాలకృష్ణ (బాలు) ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏలూరులో బైక్ ర్యాలీని ప్రారంభించిన జిల్లా అధ్యక్షుడు బాలు మాట్లాడుతూ జిల్లాలో యాదవులు రాజకీయ పార్టీల గెలుపోటములను నిర్ణయించే శక్తిగా ఉన్నారన్నారు. అయినా యాదవులకు రాజకీయంగా తగిన గుర్తింపు రావడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో యాదవులకు ఒక ఎమ్మెల్యే సీటు కేటాయించాలని కోరారు. యాదవ కార్పొరేషన్‌కు ఏడాదికి రూ.2వేల కోట్లు కేటాయించాలని, యువతకు ఉపాధి కొరకు రూ.10 లక్షల రుణాలు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వారికి కార్లను 50 శాతం సబ్సిడీతో కేటాయించాలన్నారు. పేద యాదవ విద్యార్థులకు గ్రూప్స్, సివిల్స్ వంటి పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ అందించాలని, మెరిట్ సాధించిన ఆసక్తి కలిగిన విద్యార్థులు 50 మందిని ఏటా విదేశాలకు పంపించాలన్నారు. పశ్చిమగోదావరి జిల్లా యాదవ సమితి అధ్యక్షుడు నీలపాల దినేష్, పొన్నుబోయిన సురేష్, కాట్రు విజయ్, పెనుబోయిన మహేష్, ఎం.పానకాల యాదవ్ పాల్గొన్నారు.

దాసాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

గణపవరం : మండలంలోని అర్ధవరం గ్రామంలో శ్రీ దాసాంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన కంతేటి భుజంగరాజు, సూరమ్మ దంపతుల కుమారుడు కంతేటి సూర్యనారాయణరాజు సుమారు రూ.40 లక్షల విరాళంతో ఆలయ పునర్నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠ, పూజలు, హోమాలు, అన్నసమారాధన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఈ కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. తొలుత ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. దాత కంతేటి సూర్యనారాయణరాజు, నాగలక్ష్మి దంపతులు పీటలపై కూర్చుని పూజలు నిర్వహించి, విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా భీమవరానికి చెందిన 9 ఏళ్ల చిన్నారి బొలిశెట్టి చేతన భగవద్గీత పారాయణం చేసి అందరినీ ఆశ్చర్యపరిచింది. అనంతరం అన్నసమారాధన చేశారు.

వైభవంగా వీరభద్రుడి కల్యాణం

కామవరపుకోట : కామవరపుకోటలో కొలువైన భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి కల్యాణం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. వేద పండితుల ఆశీర్వచనాలతో మంగళ వాయిద్యాల నడుమ స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహించారు. తెల్లవారుజామున సూర్యోదయానికి ముందే స్వామి వారి కల్యాణం వెన్నెలలో నిర్వహించడం ఇక్కడ ప్రత్యేకత. ఈ కల్యాణ ఉత్సవాలకు సుదూర ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. మధ్యాహ్నం శ్రీ వీరభద్ర స్వామి అన్నదాన కమిటీ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి ప్రారంభించారు.